# ఎదురుచూపులు





**జీవితంలో** ఎదురైన అతిప్రాముఖ్యంగల సంఘటనల్నీ, విలువైన అనుభూతుల్నీ చిత్రించాలనుకుంటే అలాంటివి ప్రతి జీవికీ తన జీవితకాలంలోపే ఒకటో, రెండో—అవీ నామమాత్రంగా కన్పిస్తాయి. ఆటే కథారచనలో ఇముడ్చాలని ఉబలాటపడి చిత్రిస్తే, "మేవ తృప్తి తీరి మనస్సు ఆనందించవచ్చుగానీ పాఠకుల్ని నూటికి నూరుపాళ్ళు ఆకట్టుకుంటామనే నమ్మకం లేదు. ఒకవేళ ఆకట్టుకోవడం జరిగినా, ప్రతితడవా విలువైన అతి ప్రముఖమైన సంఘటనలకోసమే ఎదురుచూడ్డం సంభవిస్తే, కాలం ఈలోపున అవిటిదవుతుంది, ముసిలిదవుతుంది.

ఒక్కొక్కసారి మనకు అతివాస్తవికత అని తోచినది పాఠకులకు వెగటుగా, పూర్తి కల్పనగా అనిపిస్తుంది. అలా భయపడుతూ కూర్చుంటే మనకు నిరాశ విశ్వరూప సందర్శనమిస్తుంది. ఏది విలువయిందీ, ఏది కాదూ అనుకుంటే జవాబు లేదేమో! రాదేమో బహుశా! కాని పరిస్థితుల్లో నిఖార్సయిన విలువలే సాహిత్యపు సున్నితపు త్రాసులో మిల్లీగ్రాంకూడా తూగకపోవచ్చు. మరొకసారి సాధారణ సంఘటనే జీవితం లీటర్ నుంచి లావాలా పొంగి అసాధారణంగా, అంటే అద్భుతంగా ప్రజల్లో చైతన్యం తేవచ్చు. దానికి ప్రస్తుత ప్రపంచం నడకే తార్కాణం. వంచన చెయ్యడం చాలా సులభం: పెగా సరదా

*కావాలని పట్టుకుని ప్రాకులాడడమే కనిపిస్తుంది కాని అంతిమంగా ఏదీ దక్కదు. మానవ జీవితమే అంత. మరి విలువ ఉన్నా, లేకపోయినా పోగొట్టుకొన్నదానిని గురించి బాధపడని వ్యక్తి ఉండడు. సరిపెట్టుకొనడానికి ప్రయత్నమూ చెయ్యడు.*

కూడానూ. పదిమందిని దుయ్యబట్టడం నిజాయితీకి మరో పేరు. వ్యక్తిత్వం లేకుండా ఉండడం ఉన్నతికి పెద్ద నిచ్చెనలాంటిది. వ్యభిచారం పరమ పవిత్రమైన ఆచారం; మానలేని అలవాటు. ఎలా, ఎందుకు — అనే ప్రశ్న కూడదు. ఈ అధునాతన యుగంలో ప్రశ్నార్థకమోహం వేసేవాడు ద్వీపాంతరం శిక్షకు అర్హుడు. తప్పు అని చెప్పేవాడికి ఉరిశిక్ష తప్ప మరో దారి లేదేమో! ఆఖరిమాటగా ఇరవయ్యో శతాబ్దం మనిషికి నునుపైన కాంక్రీట్ రోడ్డులాంటిది. జర్రున సాగిపోవాలి. పాదరసం అతని నామాంతరం. అవినీతి, మోసం అతనికి కవచకుండలాలు. రాజకీయాలు పరశురామ ప్రసాదిత బ్రహ్మాస్త్రం. నిజానికి అసలు సిసలైన విలువలే మనిషికి ఉండాలనీ, అలా ఉండేటట్టు చెయ్యమనీ, ఏ ఋషిపుంగవులూ, భూతకాలంలో భగవంతుణ్ణి ప్రార్థిస్తూ తపస్సు చేసిన నిదర్శనాలు లేవు. చెదురు, మదురుగా ఉన్నా అవి వ్యక్తిపేరిట జరిగినవి మాత్రమే.

ఇవేమీ వ్రాయకుండా కథ ప్రారంభించాలనుకున్నా. కానీ, కథకో ఉపోద్ఘాతం ఉండాలంటాడు నా మిత్రుడు. "ఏం?" అన్నాను నెమ్మదిగా.

"నువ్వు అడుగున్నర పొడుగులేకుండా పుడుతోన్నప్పుడే ఓ మాతృమూర్తినీ, పదిమంది ఆడజనాన్నీ, పెద్ద ఇంటినీ గజగజలాడిస్తూ రొద వేసుకుంటూ ప్రపంచ ప్రవేశం చేశావు. ఆరు అడుగులకు కొంచెం యెదిగి, పైగా కథారచనకి పాలుబడ్డప్పుడు ఈ ఉపాఖ్యానం ఉండకపోవడం తప్పుకదా!" అన్నాడు.

మౌనంగా అంగీకరించాను.

నాకు డబ్బు విలువ తెలియనిరోజులు అవి. ఈనాడూ నాకు డబ్బు విలువ తెలియదు. అలాగని నేను లక్షాధికారిని కాను. పోనీ చచ్చేవరకూ తరగని చరాస్తీ లేదు. మరెందుకు తెలియదన్ని అడగవచ్చు మీరు. కొందరు నమ్మరనుకుంటాను కూడా. కానీ, అలా అడగకుండా ఉంటే చాలు. ఎందుకంటే అది ఈ శతాబ్దంలో వేయవలసిన ప్రశ్న కాదని నేను ముందే విన్నవించుకున్నాను.

నాలుగేళ్ల తరువాత నేను కాకినాడ వెళ్లాను. కాకినాడ చాలా మారిపోయింది. దేశ సంస్కృతికి ఊళ్ళు పెరగడం చక్కని నిదర్శనం కాబోలు! ఇక్కడ కొలబద్దలతో నిమిత్తంలేదు. అలా అయితే లావుపాటి అమ్మాయి పదేళ్ల తరువాత కూడా పరికిణీ, కండువా వేసుకుని తను ఎదిగిన మాట మరిచిపోతూనే ఉంటుంది.

వసంత్‌విహార్ యజమాని మరిన్ని అంతస్తులు పెరిగాడు. కొత్త షాపులు పుట్టుకు వచ్చాయి. అందరూ కొత్తవాళ్లలాగే కన్పిస్తున్నారు. పరికిణీ, జాకెట్టూ వేసుకుతిరిగే ఒంటి జడ ప్రభావతి కాకినాడతో సమానంగా, పవాల్‌గా ఎదిగిపోయింది. చేనేతచీర మందారం రంగుది, తాజమహల్ లతలు చూపించే అదే రంగు జాకెట్, నడకలో కొత్తదనం, మరీ నెమ్మదిగా, అందం తొణికిసలాడుతుందేమో అన్నట్టుగా బంగారం రంగు. శరీరం, నిప్పుమీద ఎర్రగా కాల్చినట్టు, సాగదీసినట్టూ ఉంది. పైగా ప్రకృతి నగిషీలు శరీరంమీద.

మా పక్కింటి కృష్ణారావుగారికి ఆ రోజుల్లో ప్రాక్టీసు లేదు. అరుగుమీద కూర్చుని, ఇద్దరు తలలుమాసిన వెధవలకూ—రోడ్డుమీద ఘర్షణ పడే అలగా జనానికీ తీర్పులు ఇస్తూ "లా" మర్చిపోలేదన్నట్టుగా తనలో తనే నవ్వుకునేవాడు. నా మిత్రుడు జానకిరామయ్య అప్పటికి 'లా' చదువుతూ ఉండేవాడు. అతనికి ఎప్పుడూ ఆయన్ను చూపించేవాణ్ణి. అతనికి కోపం, నేను నవ్వడం. తన భవిష్యత్తు అలా ఉంటుందని నేనూహిస్తున్నానేమోనని.

అలాంటిది, గడిచిన సంవత్సరాలు అదృష్టాన్ని పులుముకుని ఆయన్ను యీడ్చిపెట్టి తన్నినట్టున్నాయి. బొంబాయి తార నివాసం నమూనా 'బంగళా' కట్టించాడు. ఇంటిముందు నల్లకారు. అది ప్లీడరు గారిదిట. మరో రెండు వెరైటీ కార్లు. క్లయింట్లవనుకుంటాను. ప్లీడరీ వృత్తిలో ఉన్న జబ్బే యిది. మహమ్మారీ లాంటిది. వచ్చిందంటే ఒళ్లంతా సిరిపూసి మరీ వదిలిపెడుతుంది. ఒక్కొక్కసారి లాటరీ టికెట్టు కొన్న ఆశాజీవి ప్లీడరుకన్నా ఎక్కువ సుఖపడతాడు నిరీక్షణ విషయంలో. ఓర్పులేని వ్యక్తి ప్లీడరీ వృత్తిలో రాణించలేడు. నేనే కృష్ణారావు గారినయితే పదేళ్లనాడు సన్యాసం పుచ్చుకుని పారిపోయేవాణ్ణి.

"నువ్వూ ప్రాక్టీస్ పెడతావా?" అన్నాను జానకిరామయ్యను చూస్తూ.

"చెయ్యాలనే అనుకో....."

నవ్వు వచ్చింది. అవును. అతనూ ఓ పట్టా టిక్కెట్టు కొన్నవ్యక్తేగా? ధోరణిమార్చి "ఊరు చాలా మారిందిరా" అన్నాను.

"అవును. ఇంకా మారుతుంది."

కొత్తగా ఊరు చివర వరకూ పాకిన మాధవనగర్, శ్రీనగర్ వెలివేసినట్టుగా పూర్వం అక్కడ యింజనీరింగ్ కాలేజీ, దానికి కాపలాగా పోలీస్ క్వార్టర్స్ ఉండేవి. అలాంటిది పూర్వపు అనాథాశ్రమపుభవనం మెడికల్‌కాలేజీభవనంగా మారింది. అక్కడే 'అద్దెకివ్వబడును' కోసం భూమిలోంచి యిళ్ళు చాలా లేచాయి. గాంధీనగరం పార్కు, రామారావుపేట నాల్గులైట్ల జంక్షన్, పుత్రయ్య కిల్లీకొట్టు బాగుండదని మర్యాదకోసం అలాగే ఉన్నాయి. సూర్యారావుపేట, కుళాయి చెరువుగే త్రిపురసుందరి గుడి, పిండాల చెరువు, అలా, దూరంగా సినిమా వీధి రంగులు పులుముకున్నాయి.

ఉడిపి హోటల్లోకి వెళ్లాం. కాఫీ తాగి బిల్లు నేనిచ్చాను. ఇద్దరూ విడిపోయి నేను ఒంటిగా ఇంటికి బయలుదేరాను. ముఖ్యంగా కాకినాడ గురించి వ్రాయడానికి కారణం చెప్పలేదు. నేను పుట్టింది అక్కడికి కొంచెం దూరమయినా, పెరిగింది ఆ ఊళ్లో. వ్యక్తిత్వం నేర్చుకున్నదీ, చదువుకున్నదీ ఆ నగరిలోనే. నేను ఇప్పుడు సంపాదించుకున్నదీ, ముందు గణించేదీ — కీర్తయినా, అపఖ్యాతయినా— అది కాకినాడతోనే ముడిపెట్టుకుని ఉంది. నేను పొందిన లాభనష్టాలకు ఆ ఊరు భాగస్వామి అవుతుంది. అందుకే ఆ ఊరంటే నాకు ప్రేమ, దహించే ద్వేషం కూడానూ.

ఇంటికి వచ్చాను. నిజమైన సంఘటన ఇక్కడే ప్రారంభమయింది. మేనల్లుడు రమేశం సినిమాకు తీసుకువెళ్లమన్నాడు. వాడికింకా చిన్నతనం. కాలేజీ వాడికి సంవత్సరంనుంచే పాఠాలు నేర్పుతున్నది. సరేనన్నాను. భోజనం చేసి జేబులు తడుముకున్నాను. ఖాళీ. ఉన్న ఎనిమిది రూపాయల్లో ఐదు రూపాయల కాగితం ఎక్కడో జారిపోయింది. నాకు షాక్ తగిలినట్టయ్యింది.

నేనేనాడూ డబ్బు పోగొట్టుకోలేదు. అలా పోగొట్టుకున్నవాళ్లనుకూడా హేళన చేసేవాణ్ణి. మౌనం శరీరాన్ని కమ్ముకుంది. ఆనాడు అపహాస్యం పాలయినవాళ్లు కళ్లముందు గేలిచేస్తూ నిల్చున్నారు. నేను అబద్ధం ఆడలేను. దానికెంతో కష్టపడాలి. నాకు అబద్ధం ఆడేవాళ్ళు ఆశ్చర్యంగా కన్పిస్తారు. అలాగని నేను సత్య హరిశ్చంద్రుణ్ణి కాను. హాస్యంలో అనృతం, పాలూ నీళ్లలా కలిసిపోతుంది. హాని చెయ్యదు. అతివిషాదంలో, నమ్రతతో నమ్మకాన్ని అబద్ధంతో తుడిచిపెట్టేవాళ్లంటే నాకు భయం. ఎక్కడినుంచో లేని ఆప్యాయత అరువు తెచ్చుకుని, పెదవులతో సత్యాన్ని దాచి పెట్టడం ఘోరమైన నేరం. మరో రూపేణా నేర్పరితనమేమో! అయితే, అలాంటి నేర్పరితనం నాలో లేదు. అందుకే నాకు చాలామంది కావలసినవాళ్ల సంఖ్య లభించలేదు. నా అవమానం ఎవరితో చెప్పుకోవాలి? ఆలోచనలు నన్ను జయించాయి. పదిమందిని కదిల్చి కన్నీరు కార్పించే సంఘటనలకు నేను ఏమీ కాను. ఆనందంగా తెల్గ్గా నవ

**‘శ్రీ సుభా’**

గలను. హృదయపూర్వకంగా ఓదార్పూ, ధైర్యం అందిస్తాను. అలాంటిది ఈ చిన్ని ఘటన నన్ను ఓటమి అంగీకరింపజేసింది.

"ఐదు రూపాయలు ఏమంత పెద్ద మొత్తం అని? పోతే పోయాయి" అంది అక్కయ్య నేను మాట్లాడక పోవడంచూసి.

అక్కడికీ అన్నాను: "నేను డబ్బు ఎప్పుడూ పోగొట్టుకోలేదు. ఇదే మొదటి అనుభవం. అయినా, నా మనసులోమాట అదికాదు." అన లెందుకు పోవాలి అనే కోపం, బాధ. పైకి అమాట అనలేకపోయాను. ఆత్మ పరిశీలన చేసుకుం టున్నది.

"పదిమంది దగ్గర తలవంచే సంఘటనలను, అనుభూతులను తట్టుకోలేవు. అందుకే ఆ యాతన. నువ్వొట్టి అమాయకుడివి. రత్నాలు పారేసుకుని గాజుకోసం గిలగిల్లాడే మణిశిలా—ఏమిటి?"

కావచ్చు! అతిహీనమయిన, నలుగురి ముందు వ్యక్తిత్వం నిలుపుకోలేని శిథిలతను భరించలేను. తట్టుకోలేను. ఇలా జరక్కూడదసలు.

మనస్సులో సాగర మథనం నిద్రలోగాని ఆగలేదు. కునుకు పట్టేముందు అనుకున్నాను—అది ఏ లేనివాడికైనా దొరికితే చాలు. నేను దాన్నెలాగూ సద్వినియోగపరచలేను. విలువ తెలిసినవాడికి అందితే చాలు. ఈ విషయం మరితోనైనా చెప్పాలా, వద్దా అనే మీమాంస మొదలయింది. చెబితే చిన్నతనం. రహస్యం—లేక నా అనుభవం — శరీరంలో రక్తంతోపాటు పుట్టినే అలజడి కలిగిస్తూ ప్రవహించే గుణం ఉందిగానీ, నరనరాల్లో కలిసిపోయే ఆత్మీయత, ఉమ్మడితనం ఎరుగదు.

* * *

ఆరు నెలలు గడిచిపోయాయి. నేను విజయవాడలో ఉంటున్నాను. ఓరోజు రమణమూర్తి వచ్చాడు. వాడు యువరచయిత కావాలనుకుంటున్న వ్యక్తి. చాలామటుకు అందుకు కావలసిన సరుకును సంపాదించి పెట్టుకున్నట్టే కన్పించాడు మాట తీరూ, అదీ చూస్తే. జ్వరానికి కొన్ని లక్షణాలు ఉన్నట్టే, రచయితకు కూడా అంత ర్యంలోనూ, బాహ్యంలోనూ కొన్ని గుర్తులు, చెరగని ముద్రలు పడిపోతాయి. "వార్"కి వెళ్ళ బోయే 'సోల్జర్'లా మాట్లాడేస్తూ సాహిత్య విమర్శ సాగిస్తున్నాడు. వాడు తిరిగి భౌతిక ప్రపంచ ప్రవేశం చెయ్యడానికి అరగంట పట్టింది. అంతవరకూ వాడొక మైకు. అది విశగలిగిన నేను — ఒకే ఒక ప్రేక్షకుణ్ణి, ఆఘాతుణ్ణి.

"నాపెళ్ళికి రాలేదేరా?" అన్నాడు.

"అప్పుడు నేను అజ్ఞాతవాసంలో ఉన్నాను."

"అదేమిటి?"

"అది అంతేరా. వీలు చిక్కలేదు. పైగా మా సూర్యనారాయణమూర్తి మామయ్య నే కన్పించా నంటే చాలు— పెళ్లి పెళ్లి అని పీక్కుతినేస్తాడు. ఆయన్ని తప్పించుకు తిరిగి, శరీరం చిలక్కొట్టు కాకుండా ఉండాలంటే అదేదారి అన్పించింది."

"లేదురా. ఆయ నీమధ్య చాలా మారి పోయాడు."

నాకు నమ్మకం కలగలేదు. అదే వాడు కనిపెట్టి, "నిజంరా. ఉద్యోగం కూడా చేస్తు న్నాడు అన్నాడు."

"ఈ వయసులో?"

"తోచడంలేదని చేస్తున్నాడు."

ఆశ్చర్యం! అతను లేకపోతే ఊరుకే తోచ దేమో? ఇందులో మిస్టరీ ఉందనిపించింది. సూర్య నారాయణమూర్తిగారు నలభైయేళ్ల వాడు. చుట్టాల్లో అంతకన్నా పెద్దవాళ్లు ఉన్నా, వాళ్ల మూలపడ్డం మూలంగా, బంధువర్గాని కంతటికీ కోరకుండా అందివస్తున్న ఆత్మీయుడు. ఉద్యోగం చెయ్యనవసరం లేదు. పొలం ఉంది. ఎక్కడినుంచో, ఎవరిదో, ఏదో డబ్బువచ్చి జేబులో తిరుగుతూ ఉంటుంది. ఆదిలో అందరూ ఆ డబ్బును మోసంగా చూసేవారు. ఓరోజు కాలవ కింద ఆరువేలు చేసే భూమి, రెండెకరాలు అమ్మేయడంతో, చుట్టాలు ఆలోచనలేకుండా ఏడ్వడం సాగించినా, విజ్ఞులు పాతఖర్చులూ, అవీ తిరగేసి అమ్మడం సబబే అని తేల్చారు. అలాంటి సూ. మూ. గారి కోసం ఎవరూ వెదక వవసరం లేదు. ఆయనే అందరినీ వెదుకుతూ వస్తాడు. అదీ ఆయనలో ప్రత్యేకత. చుట్టాల్లో, ఊరిలో ఎవడు ఉద్యోగస్తుడయినా తనే కారణం అంటా డు. ఆడపిల్ల పెళ్లి ఊర్లో అయితే సన్నాయి రాగంలో తనపేరు విన్పిస్తున్నదంటాడు.మూడో రకం విమర్శకుడుగా తన హోదాను ప్రతిష్ఠింపించుకోవడంకోసం పట్టీ నోటితో పగలబడి నవ్వుతాడు. మాంసాహారుల్ని దుయ్యబడుతూ, కోడిగుడ్డుతో తయారయిన బిస్కెట్ల పేకెట్లు దొంగచాటుగా తింటూ, అదేమని నాలాంటివాళ్లు అడిగితే, "ఆరోగ్యం కోసరంరా. జీవహింస నేను చెయ్యలేను"అనడం సూ. మూ. గారికే చేతనవును. వెనకోసారి అడిగాను: "ఇంత చేసిన పెద్దమనిషివి, మా అబ్బాయికో ఉద్యోగం చూసుకోలేకపోయావా?" అని.

"మంచివి లేవురా. అందుకే ఖాళీగా ఉంచాను" అన్నాడు.

"అయితే నువ్వేగా మాకు ఉద్యోగా లిప్పించింది? ఇవన్నీ చెడ్డవేనన్నమాట."

"అది కాదురా." నవ్వేస్తాడు.

తను స్వార్థంకోసం పుట్టలేదనే రుజువు కోసం, ఆ కీర్తి పతాకకు అడ్డుగా కొడుకును దాచుకుంటున్నాడని నా కనుమానం.

ఏది ఏమైనా సూ. మూ. గారిలాంటివారు ప్రస్తుత ప్రపంచ పురోగమనానికి చాలా అవ సర పడతారు. భారతదేశానికీ, ఆయనకూ చాలా పోలికలున్నాయి. తరిచిచూస్తే ఎవరు దేశమో,

## పూజారి

### గోగినేని సత్యనారాయణ

కోట్లాది నీ కణాల్లో
ఒక్కటి నేను.
నీ ప్రేమే సర్వంగా
పూజించుకునే
ఒకణ్ణి నేను,
నీలో భాగాన్ని,
నీ ఆధారంగా వున్నాను.
నీవంటే నేనుగాదు,
అయినా నేనంటే నీవేలే.
నీలో భాగాన్నని చెప్పుకునే
ధీమా కలిగింది నాకు.
నా పోలికలన్నీ మా
అమ్మవేమ్మ అనుకుంటే,
ఎంతహాయి కలిగిందో
ఏంచెప్పను, అమ్మా!
నీ ప్రేమను పొందేందుకు
నీదృష్టిని పిలిచేందుకు
హృదయం తెపతెపలాడి,
నాలుకపై తడి ఆరి,
పలుకులధ్వని కదల్లేదు
అయినా నే కోరికోరి
నాపై నీ చెలాయింపు
కోసం చూస్తున్నా.
నీకోసం కరిగిపోయి
నిర్వాణం చెందాలని
హృదయంలో యేదో
నాకుపదేశం చేస్తోంది.
అందుకనే నీకయి బలి
అవుదామని చూస్తున్నా,
నాకే సంతోషమయి. *

ఎవరు మనిషో చెప్పడం కష్టం.

నేనూ, రమణమూర్తి కలిసి స్టేషన్‌కు వెళ్లాం. వాడు ఆ రోజే హైదరాబాదు వెళ్లి పోతున్నాడు. బుకింగ్ ఆఫీస్‌నుంచి వెదుకు లాడుతూ వస్తున్నాడు వాడు.

"ఏమిటి వెదుకులాడుతున్నావు?"

"ఐదు రూపాయల కాగితం పోయిందిరా" అన్నాడు.

"నిజం?"

"నీ మొహం. అబద్ధంగాకూడా పోతుం దేమిటి?"

ఎన్నో తిట్టాలనుకున్నాను. రైలుస్టేషన్‌లో, సినిమా హాల్స్‌లో, హోటల్ కౌంటర్‌దగ్గరా నిరుత్సాహముఖంతో డబ్బు పోగొట్టుకునేవాళ్లు నాకు పూర్వంలో ఆటవస్తువులుగా కన్పించే వారు. వెక్కిరించి నవ్వేవాణ్ని. ఇప్పుడెలా విమర్శించగలను?

"పోతే పోయిందిలే."

"అంతేలే. అలా అనుకోకపోతే కష్టం చూడు." ఆగి ఆశ్చర్యంగా చూసి "అదేమిటి అలా ఓదార్చేమొహం పెట్టేవ్? నువ్వింకా రైలు దాటబెట్టి నన్ను కామెంట్ చేస్తూ కూర్చుంటావనుకున్నాను" అన్నాడు.

నేనేం మాట్లాడలేదు.

"ఈ డబ్బు పోవడం, దొరకడం చాలా ఆశ్చర్యంగా జరుగుతూంటాయి. అర్నెల్లనాడు నిన్ను కాకినాడలో కలిశాను,చూడు..ఆ మధ్యాహ్నం నేనూ, కామరాజూ కలిసి ఉడిపీకి వెళ్లాం. నేను కౌంటర్ దగ్గరకు వెళ్లి బిల్లుడబ్బు చెల్లిస్తున్నాను. వాడు మూలగా వంగి నేలమీద పడి ఉన్న ఐదు రూపాయల కాగితం తీసుకుంటున్నాడు. అక్కడే నించున్న మరో వ్యక్తి అడిగాడు— 'మీదేనాండి?' అని. అతి నెమ్మదిగా కామరాజు 'అవును' అన్నాడు. ఆశ్చర్యం! వాడి జేబులో ఆ క్షణానికి డబ్బు లేదని నాకు తెలుసు."

"ఏ రోజు? జూన్ 21 వ తారీఖునా?"

"అవును. నేనూ ఆశ్చర్యంతోనే అడిగాను, కామరాజుని, యేమిటిదని. వాడు నవ్వాడు. అది నిజంగా తనదీ కాదుట. కానీ, నడిచివచ్చిన డబ్బుని కాలదన్నుకోవడం ఎందుకని, తనదే అన్నాట్ట."

"ఛా ఛా!! అన్యాయం. పైగా వెధవపని."

"ఏమిటి? దొరకడమా? తీసుకోవడమా?"

"రమణమూర్తీ, ఐదు రూపాయలు పారేసుకున్నందుకు నీకు బాధగా లేదా?" అన్నాను. వాడు వింతగా చూశాడు.

"డబ్బేమిటి? ఒక్కొక్కసారి అంతకన్నా విలువైన వస్తువులే పారేసుకుంటాం. అది అజాగ్రత్త కాదు. మనం కాగలించుకుని కూర్చున్నా పోయేవి పోతూంటాయి. పోయేవాటివైపు నిరాశాజనకంగా చూస్తూ వీడ్కోలు చెబుతూ అనాహూతంగా వచ్చేవాటికి యెదురువెడితే గతం గాయం చెయ్యదు." వాడు మరికొంత తేరుకుని, "నీకివన్నీ నేను చెప్పడం అనవసరం. అయినా ఈ రోజు ఇలా మాట్లాడుతున్నావేం?" అన్నాడు.

నేను ఎందుచేతో జరిగిన సంఘటన వాడి ముందు చెప్పేశాను. దాచుకోవాలనుకున్నా దాగ లేదు. అది నన్ను పెట్టిన తికమక కూడా వివరించాను.

వాడు ఖంగున నవ్వేశాడు.

"ప్రళయంలో చిక్కుకున్న సముద్రంలో అవలీలగా ఈదడం నేర్చినవాడు చిన్న కాలవలు, నదులుకూడా ఉన్నాయనే మరిచిపోతాడు. సాఫీగా సాగే నదిలో ఈదడం తేలిగ్గా కన్పిస్తుంది. కానీ, కాని పరిస్థితుల్లో నదిలో ఓడిపోతే, వాడికి ఈత రాదంటావూ? లోతుపాతులు తెలియని రోజున మునిగిపోవడానికి సముద్రమే అక్కర లేదు; చిన్న కాలవ చాలు."

"అంటే?"

"జీవితంలో ఎదురైన భీకరమైన సమస్యల్ని ఎదుర్కోవడం, ఓకొలిక్కి తీసుకురావడమే కాదు. ఇలాంటి చిన్న చిన్న విషయాలని ఎదుర్కోవడం అవమానకరంగా అనుకోకపోతే చాలు" అన్నాడు.

నాకేం నచ్చలేదు వాడి ధోరణి. అందుకే విషయం మార్చాను. దూరంనుంచి ప్లాట్‌ఫారం అనే వివాహమండపంలోకి చోట్లనే కొత్త పెళ్లికూతుళ్ళని మోసుకువస్తోంది రైలు. స్వయంవరానికి సభాప్రదేశం చేరిన యువకుల్లా ఎంతమంది జనం, హోరాహోరీ పోరాటం, కొంతమందికి రాజకుమార్తెలు దొరకకపోవడం, కొట్లాటలు, బలవంతుల విజయాలు, యుద్ధం, శాంతిభద్రతల ప్రవేశం, న్యాయాన్యాయ ప్రమేయం లేకుండా కాళ్ళ కుమ్ముకోవడం. గడిచిన శతాబ్దంలో రాక్షస వివాహాల్లాంటివి, ఈ రోజుల్లో రైళ్లలో చోటు దొరకడం. ఇంకాపోతే స్వయంవరం తంతు సమన్వయిస్తుంది అతి చక్కగా.

రమణమూర్తి రైలెక్కి వెళ్లిపోయాడు. రైలే వాడిని ఎక్కించుకుంది కాబోలు. ఐదు రూపాయల సంఘటన తిరిగి నన్ను కలవరపెడుతుండగా మౌనంగా నడక సాగించాను, ఆ విడని చిక్కును భారంగా మోసుకుంటూ.

• • •

ఆనాటి సంఘటన విన్న తరువాత నా ఐదు రూపాయలు పోవడం గురించి నేను మథనపడ్డం వట్టి అవివేకం, అల్పత్వం అన్పించింది. నాదగ్గర నుంచి పోయికూడా నా డబ్బు మరో వ్యక్తిని అమితంగా ఏడ్పించింది. బాధ కలిగించింది.

నేను, శారద వస్తున్నదంటే స్టేషన్‌కు వెళ్లాను. అర్నెల్లయ్యింది. కడుపులో ఎదిగిన పసిపాపను దాచుకుని పుట్టింటికి వెళ్లిన శారద, ఆ పాపాయిని—పొత్తిళ్లలో ఎత్తుకుని తిరిగి వస్తున్నది. చాలా మారిపోయి ఉంటుంది.

స్టేషను రైలు లేటని అరిచింది. కొంచెం



రాధామాధవులు

చిత్రం—మణికుమారి (విశాఖపట్టణం)

సేద దీర్చుకోమంది ఆత్రుత. వెళ్లి బుక్‌స్టాల్ ముందు నించున్నాను. సాహిత్యం రంగురంగుల చొక్కాలు తొడుక్కుని వ్రేళ్లాడుతున్నది. కాళ్ల కింద కుక్క కాబోలు తన్నుకులాడింది. విదులుచ్చుకున్నాను. క్రిందికి చూశాను. ఐదు రూపాయల కాగితం. ఓ యువకుడు వెదుకులాడుతూ వచ్చి అది తీసుకుంటూ, "నాదండీ!" అన్నాడు. నేనేం మాట్లాడలేదు. మరో వ్యక్తికూడా వచ్చాడు జేబులు తడుముకుంటూ.

"క్షమించండి... ఆ డబ్బు నాది" అన్నాడు.

ఆ ఐదు రూపాయల కాగితం బాహ్యరూపేణా చూస్తే యిద్దరికీ కూడా అవసరం అనిపిస్తుంది.

"నాదేనండి. ఇక్కడ కూర్చున్నప్పుడు పడిపోయింది" అన్నాడు మొదటి అతను.

"కాదు, నాది. టీ తాగుతూన్నప్పుడు పోయింది" అన్నాడు రెండోవ్యక్తి. సంజాయిషీ. క్షణంలో రెండోవ్యక్తి తాలూకు మనుష్యులు ఇద్దరు వచ్చారు "డబ్బు దొరికిందా?" అంటూ.

"దొరికింది గాని—యీయనా తనదే నంటున్నాడు" అన్నాడు రెండో వ్యక్తి.

"అయ్యో! కాలం ఇలా ఉంది. చూడబ్బాయీ, నీకు డబ్బు కావాలంటే ధర్మం చెయ్యమని అడుగు. తప్పులేదు. అబద్ధాలు ఎందుకు?"

"అది కాదండీ" అనబోయాడు ఆ యువకుడు. మరేం విన్పించుకోకుండా రెండోవ్యక్తీ, అతని తరపు మనుష్యులూ వెళ్లిపోయారు.

ఆ మొదటి వ్యక్తిని క్షణంలో చీకటి ఎత్తుకుపోతున్నది ప్లాట్‌ఫారం చివరగా. నాకిదంతా అగమ్యంగా ఉంది. గబగబా వెళ్లాను.

"బాబూ, నీ పేరేమిటి?"

"చంద్రం....."

"ఆ డబ్బు నిజంగా నీదేనా?"

అతని కళ్లలో అప్పటికే కన్నీరు కదిలింది.

## నవవసంతం

తె. జి. బ్రహ్మం

కొమ్మన కోయిల
కమ్మగ పాడెను;
మల్లియ పందిరి
తుమ్మెద లాడెను.

నవవసంత
మరుదెంచినదా?
ఋతుసందేశము
నిచ్చినదా?

చెట్టూ చేమలు
గట్టూ పుట్టలు
పువ్వుల విచ్చి నవ్వినవి;
యువతీ యువజన
హృదయాబ్జమ్ముల
క్రొత్త వలపు పురిగొన్నది.

నవవసంత
మరుదెంచినదా?
నవ్య రాగమును
నింపినదా? *

నేనలా అడగటంతో ఆ కన్నీరు ఉప్పెనగా కదిలి బుగ్గలమీదుగా జారింది. వారించాను.

"నిజంగా ఆ డబ్బు నాదేనండీ."

"మరి అతను......"

"అతనూ తనదే అంటున్నాడు. నిజానికి అతనిదికూడా పోయిందేమో!"

"ఆ డబ్బుతో ఏంజేయాలనుకున్నావ్?" సహాయం చేద్దామనే సంకల్పంతో అడిగాను.

"కష్టపడి సంపాదించాను. భోజనంచేసి హాయిగా ఏ సినిమాలోనో కూర్చుని శ్రమ మర్చిపోదాం అనుకున్నాను."

"మరి భోజనం లేకపోతే ఇప్పుడెలా? ఆకలి వెయ్యడం లేదా?"

"అన్నం లేకుండా పస్తులు పడుకోవడం అలవాటేనండీ. తిండి దొరికిన్నాడే యాతనగా ఉంటుంది. ఒళ్లు విసవిసలాడుతుంది, ఇంకా ఏదో మిగిలిపోయినట్టు."

"చూడు, చంద్రం.... యీ డబ్బు పోగొట్టుకున్నావ్‌కదా! నీకు బాధగా లేదా?"

"లేదండీ. ఆ ఐదు రూపాయలూ నావైనా నేనేం చెయ్యగలను? వాడి తరపున యిద్దరు మనుష్యులు ఉన్నారు. నేను ఒక్కణ్ణి. నిజానికి ఆ డబ్బు నా దగ్గర ఉంటే చిల్లరగా మారిపోయేది. వాడైనా మంచిగా ఉపయోగించుకుంటే చాలు."

"మరి నీకెవరూ లేరా? డబ్బు ఇంటిదగ్గర ఇవ్వకపోతే ఎవరూ అడగరా? ఐదు రూపాయలు అంత తేలికా?"

"తేలిక కాదు, ప్రాణంకన్నా తీపి. కానీ, ప్రస్తుతం లేదుగా? అందుకే రుచిలేదు. వేసిరోజు ఈ డబ్బు ఇంటిదగ్గర యివ్వకపోయినా నష్టం లేదు. ఇదే పూర్వంలో అయితే నాల్గురోజులు ఇంటిమొహం చూసేవాణ్ణి కాను."

"ఏం?"

## ఐదు రూపాయలు

"మా అయ్య రోజూ నన్ను రెండు రూపాయలు సంపాదించి ఇవ్వమనేవాడు. అందులో అర్ధణా తక్కువయితే తన్నులు తప్పేవి కావు."

"ఎందుకని?"

"రోజూ అలా అడగడం ఆయనకి అలవాటు. నా స్వంతమైనా మానుకుని ఇవ్వడం నా అలవాటు." ఆగి చీకట్లోకి చూశాడు. అక్కడేం ఉందని!!

"ఆరోజు ఐదు రూపాయలు కావాలన్నాడు. రెండు రోజులు పని దొరకలేదు. కూలి చెయ్యక ఒళ్ళు తేలిగ్గా ఉందనుకుంటే, ఆ బకాయి నాన్న తీర్చేశాడు. చావమోదాడు. నన్ను వెనక పెట్టుకుందని అమ్మని తన్నాడు. అమ్మ కాలు విరిగింది. కోపంతో దొంగతనం చేసైనా తేవాలనుకున్నాను. ఏడుస్తూనే ఊళ్లోకి వెళ్లాను."

"దొంగతనం చేశావా?"

"లేదు. ఎవరో బేడ ఇచ్చారు. కాఫీ శరీరంలో పడి మూడు రోజులయింది. కాఫీ తాగి బిల్లు యివ్వడానికి వస్తూంటే, మూలగా ఐదు రూపాయలు కనపడ్డాయి. ప్రాణం లేచివచ్చింది. ఆ సమయంలో నా అంత అదృష్టవంతుడు ఉండడనుకున్నాను. డబ్బు దొరకడం తేలిక కాదుగా మరి?"

"నిజంగానా?"

"అవును. కానీ, ఒకాయన, దర్జాగా ఉన్నాడు. నాకన్న ముందు దాన్నిచూసి తనదని తీసుకుపోయాడు. ఆయనది కాదని నేను సత్యంగా చెప్పగలను. చేతిలోకి వస్తుందనుకున్న డబ్బు పోయింది. ఆ డబ్బు పారేసుకున్నది నేను కాకపోయినా నాస్వంతం, కష్టార్జితం పోయినట్టు పేవ్‌మెంట్‌మీద కూర్చుని గంట ఏడ్చాను. ఎందుకో తెలియదు. అవసరం అలా ఏడ్పించిందని తరువాత అనుకున్నాను."

ఆశ్చర్యంగా చూశాను.

"ఈరోజు పోయింది నాస్వంతం, శ్రమకు ప్రతిఫలం. అయినా నాకు విచారంలేదు. ఈ డబ్బుతో నేను వెంటనే సాధించుకోవలసిన పనులు గానీ, నలుగుర్ని సంతోషపెట్టే అవకాశం గానీ లేవు. హృదయం తెరుచుకుని కళ్లవెంబడి ఆశలు కారుస్తూ ఎదురు చూసిన్నాడు కనీసం—రాగి కానీ దొరకలేదు.

"అయినా ఆరోజు మీద నాకు హక్కువుందని ఇప్పటికీ అనిపిస్తుంది. ఇవాళ పోయిందీ, నేను పోగొట్టుకున్నదీ, ఐదు రూపాయలు కానీ ఆశను కాదు."

"నువ్వు చదువుకున్నావా, చంద్రం?"

"కొద్దిగా బాబూ!"

నేనేం మాట్లాడకుండా నా జేబులోంచి ఓ కాగితంతీసి అతని చేతుల్లో పెట్టాను. అతనెలా చూస్తాడో నాకు తెలుసు. కానీ నా ముఖకవళికలు అతను గుర్తుపట్టడం ఇష్టంలేక వెనక్కు తిరిగిపోయాను.

వెలుగుపుంతలా ఉన్న స్టేషన్ చీకటి కొట్టులా కన్పించింది. చంద్రం — నామధ్య— సప్తసముద్రాల అంతరం ఉంది. నేను డబ్బు పోగొట్టుకున్ననాడు బాధ పడ్డాను. పోయినందుకు కాదు, అల్పత్వాన్ని సహించాననే చింతను మోయడం యిష్టంలేక. అదే ఉరవడిలో ఉన్న చంద్రం నిర్లిప్తతతో ఉన్నాడు. అతనిలో ఉత్కృష్టమైన భావం ఉందిగానీ అల్పమనస్తత్వం లేదు. తనది ఎవరిదో అయింది. ఆరోజు దొరకకపోవడం ఎంత అసహజంగా ఉందని వేదనపడ్డాడో, ఈరోజు, అనవసరం అయిననాడు పోవడాన్ని అంత తేలిగ్గానూ, సహజంగానూ చూశాడు.

అందుకే మనిషి మానసికతత్వాన్ని తప్ప, బహిరంగ స్వరూపాన్ని బట్టి మనసును ఖరీదు కట్టలేం. చర్మంకింద నలిగే ఆత్మ ఒక్కొక్కసారి పడికట్టురాయికే మొగ్గి తూలిపోతుంది. నాలోని హీనాతిహీనమైన దర్పం, గర్వం సూర్యుని లేతకిరణం తాకిడికి విచ్చిపోయిన మంచు పుష్పం అవుతున్నది. ఇంకా పూర్తిగా కాలేదు. కాలం కిరణాల వేడి నాలో అవివేకాన్ని లావాలా విదిల్చి పారెయ్యడానికి ఈ శరీరంలో యింకా ఎన్ని అగ్నిపర్వతాలు రగలవలసిఉన్నాయో! మరెన్ని గాలివానలు కదిలి మూలమట్టాల్ని కుదిపి తిరగమరగ చెయ్యవలసి ఉందో! అప్పటికే నేను పూర్తి మనిషిని అనుకోవాలి. ఇది అసంపూర్తి రూపం. ఒప్పుకుంటున్నాను. నిజం! ★